క్లుప్తంగా

వినుకొండ వైద్య విద్యార్థికి బంగారు పతకం


డాక్టర్ జి.జయహరీష్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన డాక్టర్ జి.జయహరీష్ వైద్య విద్యలో ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించారు. పాండిచ్చేరిలోని జిప్‌మార్ మెడికల్ కళాశాలలో ఎండీ జనరల్ మెడిసిన్ చివరి సంవత్సరం చదువుతున్న జయహరీష్ ఇండియన్ ఫిజీషియన్ అసోసియేషన్ తమిళనాడు విభాగం నుంచి క్లినికల్ ఎక్సలెన్స్‌లో డాక్టర్ ఎ.మురగనాథన్ నుంచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. తిరునల్వేలిలో ఇటీవల నిర్వహించిన అసోసియేషన్ వార్షిక సమావేశంలో ప్రశంసాపత్రం, బంగారు పతకం అందజేశారు. బంగారు పతకం సాధించిన డాక్టర్ జయహరీష్‌ను, తల్లిదండ్రులు నరసింహారావు, వరలక్ష్మిలను పలువురు అభినందించారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు చేయూత



చిలకలూరిపేటటౌన్: ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆవోపా ఏపీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని సంఘ అధ్యక్షుడు గార్లపాటి సత్యనారాయణ చెప్పారు. ఆదివారం ఆర్యవైశ్య విద్యానిధి కార్యదర్శి మాజేటి నరేంద్ర కుమారుడు చక్రవర్తి రూ. 50వేలను ఎడ్యుకేషనల్ ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో గత కొన్ని సంవత్సరాలుగా ఎంతో మంది పేద ఆర్యవైశ్య విద్యార్థులకు సహాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. సంఘ ప్రధాన కార్యదర్శి పొట్టి శ్రీరాములు, కోశాధికారి చింతా కృష్ణారావు, సభ్యులు సామా శ్రీనివాస్, కొలిశెట్టి శరత్, ఎం.నాగేశ్వరరావు, మాజేటి చక్రవర్తి పాల్గొన్నారు.

నిత్యావసరాలు, చీరలు అందజేత



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవరావు ఆఫీస్‌లో 8మంది పేద బ్రాహ్మణులకు బియ్యం, నిత్యావసర సరుకులు, చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా హాజరైన సత్తెనపల్లికి చెందిన ఏపీ బీఎస్ఎస్ అధికార ప్రతినిధి కోనంకి మారుతి, నరసరావుపేట పురోహిత సంఘం పూర్వ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యశాస్త్రిలు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు ఏకా మారుతి రామశర్మ, సీహెచ్ రాఘవేంద్రరావు, శిష్టా శ్రీశైల మల్లికార్జునశాస్త్రి, అన్నాప్రగడ వెంకటేశ్వరరావు, ధూళిపాళ్ల నాగేశ్వరరావు, భాగవతుల రవికుమార్, చంద్రమౌళేశ్వర శాస్త్రి, సుబ్రహ్మణ్యం, ప్రసాద్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం వైపు మళ్లాలి



యడ్లపాడు(నాదెండ్ల): ప్రజల హితం కోరి భగవద్గీతను అందించిన శ్రీకృష్ణ భగవానుడే నిజమైన స్నేహితుడని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు చెప్పారు. మండల కేంద్రమైన యడ్లపాడు రాజీవ్‌గాంధీ సెంటర్‌లో త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వ సృష్టిని సృష్టించిన భగవంతుడు ఒక్కడేనని, ప్రతి యుగంలో ఎందరో మహనీయులు భగవంతుడి ఏకత్వాన్ని చాటారన్నారు. ప్రజలు త్రైత సిద్ధాంతం వైపు మళ్లాలని కోరారు. సభ్యులు అరుణ, కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపీ, శ్రీను, వీరయ్య, వెంకటలక్ష్మి, అనురాధ, రాఘవ, అమర్, చిరంజీవి, అనంతలక్ష్మి, శివ పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాల్లో 'నా భూమి - నా దేశం'

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు, సంకురాత్రిపాడు, నాదెండ్ల గ్రామాల్లో సోమవారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జాకీర్ హుస్సేన్ తెలిపారు. నాదెండ్లలో జరిగే కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు హాజరవుతారన్నారు. గ్రామాల్లో శిలాఫలకాల ఆవిష్కరణ, జాతీయ పతాకావిష్కరణ, అమరవీరుల సంస్మరణ, మొక్కలు నాటడం, ప్రతిజ్ఞ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది హాజరుకావాలని కోరారు.

అ'పూర్వ' కలయిక


1991- 92 మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థులు

పిడుగురాళ్ల: ఆప్యాయతలు...అనురాగాలు.. చిరునవ్వులు... ఎటు చూసినా ఇవే కనిపిస్తే మనస్సులో ఉన్న ఎన్నో బాధలు కనుమరుగు అవుతాయి. చిన్ననాటి స్నేహితులను చూస్తే ఇంతకన్నా చిలిపి జ్ఞాపకాలు కలిసి ఆ కలయికను మరింతబంధం చేకూర్చుతుంది. పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో 1991–92 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులంతా పట్టణంలోని జానపాడు రోడ్డులో గల శ్రీ వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కలిశారు. ఒక్కరు కాదు. ఇద్దరు కాదు..పదుల సంఖ్యలో క్లాస్ మొత్తం హాజరైతే ఆ గోల క్లాస్ రూమ్ గొలకన్నా దద్దరిల్లిపోతుంది. అందరు చిన్నారులుగా మారిపోయి తాము పెద్ద వాళ్లము అని మరిచిపోయి మరీ తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆప్యాయతలను పంచుకున్నారు. అంతేకాదు ఒకరిని ఒకరు యోగక్షేమాలను తెలుసుకుని వారి అనుభూతులను పంచుకుంటూ సాయంత్రం వరకు గడిపారు. అనంతరం అందరు చిన్న చిన్న గేమ్స్ ఏర్పాటు చేసుకుని దానిలో ఆనందంగా గడిపి తిరుగు పయనంలో తాము చిన్ననాటి జ్ఞాపకాలను మరలా వదలేసి వెళ్తున్నామనే బాధతో వెనుదిరిగి ఇంటికి పయనమయ్యారు.

మణిపూర్ ఘటన పై శాంతి ర్యాలీ


శిరిగిరిపాడు బస్టాండ్ సెంటర్‌లో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

వెల్దుర్తి: మణిపూర్‌లో జరిగిన దుర్ఘటన పై మండలంలోని శిరిగిరిపాడులో ఆదివారం లూథరన్ చర్చి రెవ. మరియానంద్ ఆధ్వర్యంలో స్థానిక పాస్టర్లు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మరియబాబు మాట్లాడుతూ మణిపూర్‌లో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. క్రిస్టియన్ మహిళల పై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో మాయని మచ్చ అన్నారు. భిన్నత్వంలో ఏకత్వమైన దేశంలో క్రిస్టియన్ల పై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంఘటన జరిగి మూడు నెలలైనప్పటికీ ఇంకా దాడులు కొనసాగుతున్నాయని, ఇప్పటికైనా దాడులకు పాల్పడిన వారి పై చర్యలు తీసుకుని వారికి న్యాయం చేయాలన్నారు. లూథరన్ చర్చి నుంచి బస్టాండ్ వరకు స్థానిక పాస్టర్లు, సంఘ సభ్యులతో శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

మహంకాళీ అమ్మవారి ఆలయానికి రూ.లక్ష విరాళం


ఆలయ ఈఓ సుధాకరరెడ్డికి చెక్కు అందజేస్తున్న భక్తులు

నరసరావుపేట రూరల్: ఇసప్పాలెంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థాన పునర్నిర్మాణంకోసం సత్తెనపల్లికి చెందిన ఈశ్వర్ రైస్ ట్రేడర్స్ అధిపతి దేవత రామజోగి, ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కార్యాలయంలో కార్యనిర్వాహణాధికారి టి.సుధాకరరెడ్డికి చెక్కు అందజేశారు. దేవస్థానానికి విరాళం ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను సెక్షన్ 80జి కింద పన్ను మినహాయింపు లభిస్తుందని ఈఓ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం

నరసరావుపేట టౌన్: ఆర్థిక సమస్యలతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామిరెడ్డిపేటకు చెందిన మారెపల్లి నవీన్(38) ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం మారుతి కుమారిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ ఎన్.వెంకటేశ్వరరావు, సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

గురజాల : రైతులు తాము పండించిన పంటలను ఈ క్రాఫ్ కింద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి ఎం సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంటను ఈ క్రాఫ్ కింద నమోదు చేసుకోవడం వల్ల ప్రభుత్వ రాయితీలు అందుతాయన్నారు. పంటలను ఆర్బీకే కేంద్రాల్లో విక్రయించడానికి సులువుగా ఉంటుందన్నారు.

సాగర్‌మాత ఆలయంలో ప్రత్యేక పూజలు


సాగర్‌మాత ఆలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: నిండు మనస్సుతో మరియతల్లిని ప్రార్థిస్తే భక్తులకు దీవెనలు అందుతాయని సాగర్ మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. సాగరమాత ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన దివ్యబలిపూజా కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సమాజంలో తోటివారిని ప్రేమిస్తూ నీతివంతమైన జీవితం గడపాలని ఉద్బోధించారు. దీనికి ముందు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

గురజాల : ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి పలువురికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని పులిపాడు గ్రామానికి చెందిన తమ్మిశెట్టి కొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు మనవడు తమ్మిశెట్టి నవీన్‌పై ప్రమాదశాత్తు విద్యుత్ స్తంభం పడి మృతిచెందాడు. తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు తమ్మిశెట్టి శ్రీను వద్దకు వచ్చి వ్యవసాయ పనిముట్లు కావాలని అడగ్గా వస్తువుతో నాకు పని వుందని శ్రీను సమాధానం చెప్పాడు. తమ్మిశెట్టి శ్రీను పనిముట్లు ఇవ్వలేదని మనస్సులో ఉంచుకుని వెంకటేశ్వర్లు తన కుమారులు గోవిందరాజు, నరసింహారావులకు చెప్పడంతో గత కొద్ది రోజులుగా వారి కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకుంటుంది. గత రెండు రోజులుగా జరుగుతున్న గొడవలను మనస్సులో ఉంచుకుని 13వ తేదీ ఉదయం తమ్మిశెట్టి కొండలు ఇంటి వద్ద ఉండగా తమ్మిశెట్టి గోవిందరాజు, నరసింహారావులు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, లింగమ్మ, ఓర్సు శ్రీను, శ్రీహరి దుర్గా ప్రసాద్, నంద్యాల శివలింగా, దేవి వీరు అందరూ కలిసి కర్రలు తీసుకుని తనతో గొడవ పెట్టుకుని దాడి చేసినట్లు చెప్పారు. తనపై దాడి చేస్తుండగా బంధువులు అయిన తమ్మిశెట్టి నాగరాజు, టి శ్రీహరి మంగ, పుల్లయ్య, రమణకుమారి మరియు కొందరు అడ్డుకున్నట్లు తెలిపారు. ప్రథమ చికిత్స కోసం గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతోనే....

పులిపాడు గ్రామంలో జరిగిన గొడవ కేవలం వారి ఇరువురి కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిందని , ఇందులో ఎలాంటి రాజకీయ కోణంలో ఏమి జరగలేదని ఎస్ఐ బి అనంత కృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఎస్ఐ మాట్లాడుతూ గత కొంతకాలంగా వారి ఇరువురి కుటుంబాల మధ్య మాటలు లేవని గత కొంత కాలంగా వారి మధ్య గొడవలు ఉన్నాయని అంతేకాని కొన్ని పార్టీలు రాజకీయ కోణంలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఎవరూ కూడా ఈ విషయంపై రాజకీయం చేయవద్దన్నారు.

– ఎస్ఐ బి అనంత కృష్ణ

శరవేగంగా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

- వేల్పూరులో రూ.4 కోట్ల వ్యయంతో..
- తీరనున్న విద్యుత్ వెతలు


సన్ పోల్స్ నిర్మాణ పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు వద్ద రూ.4 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సామర్థ్యంతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషను పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పనులు పూర్తి అయితే పూర్తి స్థాయిలో అనధికార విద్యుత్ కోతలు నియంత్రణతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి. దీనికితోడు మండలంలోని కారుమంచి, శావల్యాపురం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లు పరిధిలో అదనపు లోడు భారం కూడా తగ్గుతుంది. భవిష్యత్‌లో విద్యుత్ అంతరాయాలు వాటిల్లితే ప్రత్యామ్నాయంగా వేల్పూరు నూతన విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో నుంచి మిగిలిన గ్రామాల్లోకి విద్యుత్ సరఫరా ఇచ్చేలా కసరత్తు చేస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషను పరిధిలో 5 వేల నివాస గృహాలకు అధికారికంగా విద్యుత్ సరఫరాతో పాటు 1500 వ్యవసాయ విద్యుత్ మోటర్లకు సరఫరా చేసే ఆధునిక సామర్థ్యం కలిగిన యంత్ర పరికరాలు అమర్చుతున్నారు. వేల్పూరు గ్రామంలో విద్యుత్ మీటర్లు- 2 వేలు వెలమవారిపాలెం-200, గంటావారిపాలెం -460, పోట్లూరు-1100, బొగ్గరం-900 విద్యుత్ మీటర్లు సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి.

విద్యుత్ కష్టాలు తీరనున్నాయి



స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో వేల్పూరులో నూతన విద్యుత్ సబ్‌స్టేషను ఏర్పాటు చేయటం మంచి శుభాపరిణామం. దీని వల్ల విద్యుత్ కోతల నియంత్రణతో పాటు విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సబ్‌స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తుండటం అభినందనీయం.

–వద్రాణం నాగేశ్వరరావు, గంటావారిపాలెం

పారదర్శకంగా పనులు



నూతన విద్యుత్ సబ్‌స్టేషను నిర్మాణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయి. గంటావారిపాలెం గ్రామసమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధి నుంచి సబ్ స్టేషను వరకు 45 విద్యుత్ స్తంభాలు నిర్మాణ పనులు పూర్తి కాగానే, 5 ఎంవీ వాట్స్ విద్యుత్ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్) బ్రేకప్ పనులు చేస్తాం.

–సంపెంగుల గాంధీ, మండల విద్యుత్ శాఖాధికారి

ఆరోగ్యమిత్రల వేతనాలు పెంచాలి

వినుకొండ(నూజెండ్ల): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రల జీతాలను పెంచి వారిని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని సమైక్య కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా ఆరోగ్యమిత్రలుగా పనిచేస్తున్నామని, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని, జీతాలకు సంబంధించిన ఫైల్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య మిత్రలకు ప్రమోషన్లు కల్పించాలని, 35 సెలవులతో కూడిన స్పెషల్ లీవులు మంజూరు చేయాలని, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ల్లో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు కూడా ఇన్సెంటివ్స్ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకాని అప్పారావు, ప్రధాన కార్యదర్శి దర్శనం రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి జడ్డా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లి పోలీసు వ్యవస్థను బలోపేతం చేద్దాం


రూరల్ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ పల్లపురాజు

మాచర్ల రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని గురజాల డీఎస్పీ పల్లపురాజు కోరారు. ఆదివారం రూరల్ పోలీసు స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజలతో మమేకమై స్నేహపూరిత వాతావరణంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. ఫ్రెండ్లి పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రూరల్ స్టేషన్ పరిధిలో ఎటువంటి పెండింగ్ కేసులు లేకుండా విధులు సక్రమంగా నిర్వహిస్తున్న ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ షేక్ షమీముల్లా, ఎస్ఐ కె రాజశేఖర్, రైటర్ కళ్యాణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్


వర్క్ షాపును ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని షాదిఖానాలో సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్‌ను హనుమంత్‌రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లా వ్యాప్తగా కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాల రచ్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకున్నారు. జిల్లా వర్క్ షాప్‌కి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు షేక్ ముజఫర్ అహ్మద్, కె. ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది సంవత్సరాల్లో కార్మికులు బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేశారని, యజమానులకు అనుకూలంగా ఉండేటటువంటి లేబర్ కోర్స్‌లని తీసుకువచ్చారని దీని వల్ల కార్పొరేటర్లు మరింత లాభాలు చేకూరుతుందని, ఇది కార్మికులకు ద్రోహం చేయడమేనని వారు విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు కె. హనుమంత్‌రెడ్డి, ఎస్. ఆంజనేయులు నాయక్, సీఐటీయూ జిల్లా నాయకులు జి. విజయ్ కుమార్, జి. రవి, షేక్ షిలార్, బండ్ల మహేష్, పి. శ్రీనివాసరావు, జి. మల్లేశ్వరి, డి. శివకుమారి, టి. శ్రీనివాసరావు, షేక్ బందగిరి, హరి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమస్యను పరిష్కరించాలి

పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని సివిల్ సప్లై హమాలీలతో సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఆదివారం సమావేశం అయ్యారు. ఈసందర్భంగా గౌరవ అధ్యక్షులు కె. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముఠా వర్కర్లకు సమగ్ర చట్టం చేయడంలో కేంద్ర ప్రభుత్వ విఫలమైందన్నారు. వారికి పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగినా పట్టించుకునే నాథుడే లేడని, చటపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీలు ముఠా కార్మికులు సంపత్ వెంకట కృష్ణ, తుమ్మ వెంకయ్య, నాగేశ్వరరావు, శేషారావు, మద్దిరాల సైదులు, భూపతి రావు, నరసింహారావు, అంకారావు, సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం విద్యార్థులకు ఓ మంచి నేస్తం


పుస్తకాలను ప్రదర్శిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ప్రిన్సిపల్ మోహన్

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

రెంటచింతల: విజ్ఞానాన్ని అందించే పుస్తకం విద్యార్థులకు ఓ మంచి నేస్తం అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్ఆర్ఐవిఏ (ప్రవాస భారతీయ వాసవి సంఘం)నేతృత్వంలోని పుస్తక మిత్ర ద్వారా రూ. 35 వేల విలువైన 900 పుస్తకాలను గిరిజన పాఠశాలకు అందచేయడం అభినందనీయమన్నారు. ఈ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. మంచి మంచి పుస్తకాలను చదువుకుని విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకుని వివిధ రంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. డాక్టర్ సీఏ ప్రసాద్ విద్యార్థులకు ఆటపాటలతో సులభ పద్ధతిలో భాష నేర్చుకోవడంవల్ల మంచి ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. ప్రతిరోజు పాఠశాలలోని గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. మోహన్, వైస్ ప్రిన్సిపల్ పీడి వరప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్ భాగ్యమేరి, జె.కృష్ణనాయక్, షేక్ సుభాని, కెవి నారాయణమ్మ, పి.సత్తాజ్ బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల గొంతుక గద్దర్

ఘన నివాళి అర్పించిన ప్రజాసంఘాల నాయకులు


సంతాప సభలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పీడిత ప్రజల గొంతుకై నినదించిన ప్రజాగాయకుడు గద్దర్ అని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో ఆదివారం గద్దర్, సియాసత్ పత్రిక ఎడిటర్ జహీర్ ఆలీ ఖాన్ సంతాప సభను పౌరహక్కుల సంఘ నాయకుడు శిఖినం చిన్నా అధ్యక్షతన నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గద్దర్ దళితుడిగా పుట్టి అనేక వివక్షతలకు గురై, విప్లవ పార్టీలో కొంతకాలం పనిచేసి బహిరంగ ప్రజాసమూహంలో పేద ప్రజల గొంతుకై ఆడిపాడి ప్రజా గాయకుడిగా పేరుగాంచారన్నారు. జహీర్ ఆలీఖాన్ తాను నమ్మిన సిద్ధాంతం కోసం తాను మరణించేంతవరకు నిలబడ్డారని కొనియాడారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ గద్దర్ అనేక నిర్బంధాలను ఎదుర్కొని నిలబడ్డారని, అతని ఆశయాల బాటలో నడవడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, ప్రజాకళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రాణి, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వీవీ అబాకస్‌లో రెడ్డి కృష్ణ ప్రతిభ



సత్తెనపల్లి: జిల్లా స్థాయి వీవీ అబాకస్‌లో సత్తెనపల్లికి చెందిన రెడ్డి కృష్ణ ప్రతిభ కనబరిచాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో వీవీ అబాకస్(గణిత శాస్త్రంలో) జిల్లా స్థాయిలో చాంపియన్ షిప్ ఒకటో ర్యాంక్, రెండో ర్యాంక్ పోటీలు ఆదివారం నిర్వహించారు. పోటీలలో సత్తెనపల్లికి చెందిన రెడ్డి కృష్ణ వికాస్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నాడు. చాంపియన్ షిప్ గెలిచిన విద్యార్థికి వీవీ అబాకస్ జిల్లా డైరెక్టర్ వి.శివశేఖర్, జిల్లా ఇన్‌చార్జి శివ నాగేంద్రం మెడల్ ట్రోఫీ, ప్రశంసా పత్రం అందజేశారు.

పులిచింతలను సందర్శించిన నేతలు

సత్తెనపల్లి: పులిచింత ప్రాజెక్ట్‌ను పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట మండలం మాదిపాడు సత్తెమ్మతల్లి దర్శనానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు ఆదివారం సందర్శించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబూరావు, నేతలు సందర్శించారు.